మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ బాబే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వేదికపై జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ


బూచేపల్లిని సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- ముండ్లమూరులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సభ
- చంద్రబాబు మోసాలపై భగ్గుమంటున్న సామాన్యులు
- కూటమి ప్రభుత్వ పాలనపై ఎమ్మెల్యే బూచేపల్లి ధ్వజం

ముండ్లమూరు (దర్శి): ఇచ్చిన హామీల అమలు చేయకుండా ప్రజలను పదే పదే మోసం చేస్తూ మోసాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా సీఎం చంద్రబాబు తయారయ్యారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ మండల కన్వీనర్ చింతా శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. తొలుత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. చంద్రబాబు మోసాలను చూపే క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేశారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలను నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్ బుక్ రాజ్యాంగంలో ఇబ్బంది పడుతున్న ప్రతి కార్యకర్త, నాయకుడికి జగనన్న ద్వారా 2029లో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. ప్రతి కార్యకర్తకు బూచేపల్లి కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధన కోసం ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి కష్టకాలంలో కూడా ప్రజా సంక్షేమాన్ని మరువలేదని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు వారి అవసరాలను గుర్తించి అడగకుండానే అవసరాలు తీర్చిన ఆదర్శ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..అని కొనియాడారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను మెప్పించలేక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై విరుచుకుపడటం ఆడలేక మద్దెల ఓడు అన్న చందంగా ఉందన్నారు. ప్రజల్లో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉన్న ఆదరణ చూసి ఓర్వ లేక ఆయన కార్యక్రమాలకు నిబంధనలు విధిస్తున్నారని, జగన్ సమావేశాలకు ఇచ్చే అనుమతుల్లో ప్రజల కన్నా పోలీసులే అడ్డుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను ఆపలేరని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజలు ఆగరని చెప్పారు. పొదిలిలో అక్రమంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 40 మందిపై కేసులు బనాయించి వేధిస్తున్నారని, ఇలాంటి కుట్రలు, కుతంత్రాలకు భయపడేది లేదని స్పష్టం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని భూస్థాపితం చేస్తామని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని, ఎన్ని పార్టీలు ఏకమైనా ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేసుకున్న వైఎస్సార్ సీపీని, ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏం చేయలేరని హెచ్చరించారు. బాబు మోసాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి వివరించి చెప్పాలని బూచేపల్లి సూచించారు.

కార్యకర్తలకు అండగా బూచేపల్లి కుటుంబం

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కమీషన్లకు కక్కుర్తి పడటం బూచేపల్లి కుటుంబ చరిత్రలోనే లేదన్నారు. ఇక ముందు కూడా రాదని స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాం నుంచి ఆ కుటుంబానికి బూచేపల్లి కుటుంబం తోడుగా ఉందని ఆమె గుర్తు చేశారు. దర్శి నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం, వారిని ఆదరించేందుకు తమ తలుపులు ఎప్పుడూ తీసి ఉంటాయని పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా తాము సేవలు చేస్తున్నామని, ఇక ముందు కూడా చేస్తామని తెల్పి చెప్పారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు బూచేపల్లి కుటుంబం అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజల మధ్య ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేసి చూపిస్తానని చెప్పి ప్రజావేదికలో నిస్సిగ్గుగా చేతులెత్తేయడం ప్రజలను మోసం చేయటం కాదా? అని ప్రశ్నించారు. కనీసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను సైతం అమలు చేయలేక వాటిని అనేక వంకలు చూపి తొలగిస్తున్నారన్నారు. మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధిని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపైనే దృష్టి సారించారని మండిపడ్డారు. జగనన్న ప్రవేశ పెట్టిన పథకాలకు పేర్లు మార్చి తన కుమారుడు కనిపెట్టినట్లు చెప్పుకోవడం సిగ్గు చేటని జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ పేర్కొన్నారు. ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ రత్నరాజు, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మేడికొండ జయంతి, నియోజకవర్గ రైతు అధ్యక్షుడు బంక నాగిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సూదిదేవర అంజయ్య, దుగ్గినేని రామకృష్ణ, రాష్ట్ర నాయకులు కుమ్మెత అంజిరెడ్డి, పాలడుగు చిరంజీవి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


సభకు హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

మల్లవరం పాఠశాల తనిఖీ


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న రమేష్‌కుమార్

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని మల్లవరం ప్రాథమిక పాఠశాలను రాష్ట్ర సమగ్ర పరిశీలకుడు పి.రమేష్‌కుమార్ గురువారం సందర్శించారు. పాఠశాల ఆవరణను పరిశీలించి విద్యామిత్ర కిట్లను తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనం మెనూ అమలుపై విద్యార్థులను ప్రశ్నించారు. నాణ్యమైన భోజనం అందించాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులకు సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: మండలంలోని రెడ్డిచెర్ల సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా నూతన విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తున్నందున రెడ్డిచెర్ల, మల్లారెడ్డిపల్లె, మిట్టమీదిపల్లె, యర్రపల్లె, బ్రాహ్మణపల్లె, మదవపల్లె, గోనపల్లె, పామురుపల్లె, మూలపల్లె, భావాపురం గ్రామాలలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని ఏఈ గురువారం ఓ ప్రకటనలో కోరారు.

జెడ్పీ హైస్కూల్‌కు వాటర్ బబుల్స్ అందజేత


వాటర్ బబుల్స్ అందజేస్తున్న దాత

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంచినీరు అందించేందుకు అవసరమైన బబుల్స్‌ను పూర్వ విద్యార్థి వంకాయలపాటి రమేష్ గురువారం అందజేశారు. దాతను ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎంవీ నారాయణ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫ్రాంక్లిన్ కుటుంబానికి మందకృష్ణ పరామర్శ


ఫ్రాంక్లిన్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మందకృష్ణమాదిగ

కంభం: మండలంలోని జంగంగుంట్ల గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు పులుగుజ్జు ఫ్రాంక్లిన్ ఇటీవల మృతి చెందగా, ఆయన కుటుంబాన్ని గురువారం మందకృష్ణమాదిగ పరామర్శించారు. గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమాల్లో పాల్గొన్న ఫ్రాంక్లిన్ మరణించడం సంఘానికి తీరని లోటన్నారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి స్థితిగతులు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు విల్సన్, దేవ ప్రభాకర్, కాశీరావు, ధనరాజ్, జేమ్స్, దాస్, రాజీవ్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి


బెడ్‌షీట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ సురేఖ

కొనకనమిట్ల: పాఠశాలల విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యలో రాణించాలని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ సూచించారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో బాలికలకు పలు సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులు పరీక్షలు రాసే విధానాన్ని, ట్యాబ్‌ల పనితీరును వివరించారు. విద్యార్థి దశలో ఎలా నడుచుకోవాలి, పెడదోవ పడితే ఎదుర్కొనే ఇబ్బందుల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు సరఫరా చేసిన బెడ్‌షీట్లను అందజేశారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్యయాదవ్ గురువారం స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సిద్ధేశ్వరశర్మ మాట్లాడుతూ.. దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సయ్యద్‌రసూల్, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, పీరయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ కాలనీలో అధ్వానంగా రోడ్లు


కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

మార్కాపురం: పట్టణ పరిధిలోని భగత్‌సింగ్ కాలనీలో రోడ్లు అధ్వానంగా మారాయి. డ్రైనేజీ పొంగి మురుగంతా రోడ్డుపైకి చేరడంతో బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. ఈ విషయాన్ని కాలనీవాసులు ఇప్పటికే మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. రూ.40 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని అధికారులు చెప్పినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. సుమారు 500 కుటుంబాలు నివాసం ఉండే ఈ కాలనీలో.. విద్యార్థులు, మహిళలు, ప్రజలు రోజూ బురద రోడ్డుపై నడుస్తూ అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొద్దిపాటి వర్షానికే కాలువల్లో ఉండే బురద నీరంతా రోడ్డుపైకి చేరుతుండటం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆ ఒక్క కార్యాలయానికి సెలవట!


మూసి ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయం

పుల్లలచెరువు: మండల వ్యవసాయ కార్యాలయానికి గురువారం తాళాలు వేసి ఉన్నాయి. అన్ని కార్యాలయాలు పనిచేస్తున్నా వ్యవసాయ శాఖ కార్యాలయం మాత్రం తెరుచుకోలేదు. ఇక్కడ పనిచేస్తున్న మండల వ్యవసాయాధికారి బదిలీ కావడంతో ఇద్దరిని ఇన్‌చార్జిలుగా నియమించారు. ఇద్దరు ఇన్‌చార్జిలు ఉన్నా ఒక్కరు కూడా అందుబాటులో లేక పోవడంతో కార్యాలయానికి వచ్చిన రైతులు వెనుదిరిగి వెళ్తున్నారు. రైతు ఆనందరావు మాట్లాడుతూ ఇటీవల వర్షాలు పడటంతో కంది పంట వేసేందుకు విత్తనాల కోసం రెండు రోజులుగా కార్యాలయానికి వెళ్లి వస్తున్నానని, ఎవరూ అందుబాటు లేకపోవడంతో చేసేది లేక తాళాలు చూసి వెనక్కి వెళ్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మండలంలోని పలు గ్రామాల్లో వర్షాలు తగుమోతాదులో పడటంతో కొన్ని పంటలు సాగు చేస్తున్నారు. అదును కాలం వచ్చినా అధికారులు అందుబాటులో లేకుంటే రైతులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉంది. ఇన్‌చార్జిలుగా ఉన్న అధికారులు అందుబాటులో ఉండాలని రైతులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండాలి


మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈఓ

రాచర్ల: విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని ఎంఈఓ వారణాసి గిరిధరశర్మ పేర్కొన్నారు. గురువారం గౌతవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలతోపాటు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనాన్ని ముందుగా ఉపాధ్యాయులు రుచి చూసి, ఆ తర్వాతే పిల్లలకు వడ్డించాలని చెప్పారు. మధ్యాహ్న భోజనం అమలులో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం


వెంగల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

అర్ధవీడు: స్థానిక ఎస్ఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన గోగులదిన్నె వెంగల్‌రెడ్డిని గురువారం అర్ధవీడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అర్ధవీడు, కంభం మండల విద్యాశాఖాధికారులు ఇంకొల్లు సుజాత, అబ్దుల్ సత్తార్ హాజరయ్యారు. అర్ధవీడు మండలంలోని వివిధ పాఠశాలల్లో 30 ఏళ్లకు పైగా విద్యా బోధన అందించి గుర్తింపు పొందారని కొనియాడారు. ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు వెంగల్ రెడ్డి దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, బ్రహ్మరెడ్డి, చెన్నారెడ్డి, సునీత, శ్రీనివాసులు, సహోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా సామగ్రి పంపిణీ


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న ఎస్సై కోటేశ్వరరావు

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్లలోని కస్తూర్బా బాలికల పాఠశాలకు రాచర్ల ఎస్సై పి.కోటేశ్వరరావు తమ సొంత ఖర్చుతో క్రీడా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లో కూడా రాణించాలనే ఉద్దేశంతో ఆట వస్తువులు అందజేసినట్లు తెలిపారు. బాలికలు తమకు ఆసక్తి ఉన్న క్రీడలో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వారణాసి గిరిధర్‌శర్మ, ప్రిన్సిపాల్ మాలకొండమ్మ, ఏఎస్సై ఆదిశేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా కమల షాపింగ్ మాల్ ప్రారంభం


షాపింగ్ మాల్ ప్రారంభిస్తున్న అనసూయ, పక్కన కేశవ రావు, పవన్‌కుమార్ తదితరులు

మార్కాపురం: పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన కమల మాల్‌ను గురువారం సినీ నటి అనుసూయ ప్రారంభించారు. మాల్ యజమానులు పెనుగొండ కేశవరావు, పవన్ కుమార్ మాట్లాడుతూ.. గత 75 ఏళ్లుగా వస్త్ర వ్యాపార రంగంలో తమ కుటుంబానికి అనుభవం ఉందని, గతంలో మాదిరిగానే ఇకపైనా ప్రజలు ఆదరించాలని కోరారు. వినియోగదారుల అభిరుచికి తగిన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, ఏఎంసీ చైర్మన్ వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ ఇంటలెక్చువల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి మేడా వెంకట బద్రీనాథ్, నాయకులు దేవకి వెంకటేశ్వర్లు, వక్కలగడ్డ మల్లికార్జున్, ఇమ్మడి కాశీనాథ్, పీవీ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. సీఐ సుబ్బారావు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి


డెంగీపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

గిద్దలూరు రూరల్: డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఐ.రమేష్ పేర్కొన్నారు. డెంగీ వ్యాధి మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని పి.ఆర్. కాలనీలోని సూర్య స్కూల్ ఆవరణలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల వల్ల మలేరియా, బోదకాలు, చికున్ గున్యా, మెదడువాపు, డెంగీ లాంటి వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయుడు డి.జి.బ్రహ్మానందరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసులు, జి.వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవాలి


ఇన్‌స్పైర్-మనక్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యాశాఖ అధికారులు

మార్కాపురం టౌన్: విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలని జాతీయ ఎన్విరాన్‌మెంటల్ కోఆర్డినేటర్ టి.నాగ జగన్నాథ్, జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్, మార్కాపురం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్ రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఇన్‌స్పైర్, డివిజన్ స్థాయి సైన్స్ టీచర్స్ ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. నూతన ఆవిష్కరణలు రూపొందించేలా విద్యార్థులను ప్రోత్సహించాలని సైన్స్ ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి పాఠశాల నుంచి ఇన్‌స్పైర్-మనక్ నామినేషన్స్ పంపేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ కె.శార్వాణి, ఆర్‌పీ రవికాంత్, రాము, డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి


రక్తదాతలకు సర్టిఫికెట్ అందిస్తున్న ఎంపీపీ ఓసూరారెడ్డి

బేస్తవారిపేట: రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు రక్షించవచ్చని ఎంపీపీ వేగినాటి ఓసురారెడ్డి పేర్కొన్నారు. గురువారం సామాజిక సేవలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది సహకారంతో మార్కాపురం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 30 మంది రక్తదానం చేసినట్లు డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా రక్తదాతలను అభినందిస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఈఓపీఆర్డీ షేక్ జిలానీ, చలపతిరావు, వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేవీజీ కీర్తి

దర్శి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ ఫ్యాప్టో పిలుపు మేరకు ఈ నెల 2వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి కోరారు. జిల్లా ఫ్యాప్టో జోన్ కో చైర్మన్ బొల్లా వెంకట్రావు అధ్యక్షతన దర్శి జోన్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఏలు వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని, నూతనంగా బదిలీ అయిన టీచర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పోస్టింగ్‌ల విషయంలో కామన్ సీనియార్టీతో ప్రమోషన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీనివాసులు, కమ్మ శ్రీనివాసరావు, అట్లూరు రామారావు, రాజశేఖర్, తూము శ్రీనివాసరావు, నక్కా కోటేశ్వరరావు, పాతెం గోవింద్, ఏపీటీఎఫ్ నాయకులు బుర్రి శ్రీనివాసులు, వి. పీరు సాహెబ్, కాటిపల్లి వెంకటేశ్వర్లు, ఓ. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు